**ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం**

**ప్రాంతీయ వార్తా విభాగం**

**ప్రాంతీయ వార్తలు**

**తేది: 15.05.2026** **సమయం: 18.10 గంటలు**

**ముఖ్యాంశాలు**

1. హైదరాబాద్ లోని ప్రభుత్వ వైద్యశాలల్లో మౌలిక వసతులను మెరుగుపరిచేందుకు నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తోందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు.
2. రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతి కోసం అవుటర్ రింగ్ రోడ్డు ఇరుప్రక్కల ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయనున్నట్టు మంత్రి శ్రీధర్ బాబు చెప్పారు.
3. హైదరాబాద్ కేంద్రంగా ప్రతిపాదిత హైస్పీడ్ రైలు కారిడార్ ప్రాజెక్టులపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఈరోజు సచివాలయంలో ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు.
4. ఢిల్లీలో జరగనున్న 'ఫార్మా మాక్‌టెక్ - ల్యాబ్‌నెక్స్ట్ ఎక్స్ పో 2026' ను పురస్కరించుకుని EEPC భారత్ ఈ రోజు హైదరాబాద్‌లో రోడ్‌షోను నిర్వహించింది.

...........................................................

**గవర్నర్**

రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్లా ఈరోజు న్యూఢిల్లీ పర్యటనలో పలువురు కేంద్రమంత్రులను కలిశారు. కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి అమిత్ షా, కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్, కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడలు, కార్మిక, ఉపాధి శాఖ మంత్రి మన్సుఖ్ మాండవియాతో గవర్నర్ వేర్వేరుగా సమావేశమయ్యారు.

.....డెస్క్

**కిషన్ రెడ్డి**

హైదరాబాద్ లోని ప్రభుత్వ వైద్యశాలల్లో మౌలిక వసతులను మెరుగుపరిచేందుకు నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తోందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. ఇందులో భాగంగానే హైదరాబాద్‌లో అత్యాధునిక ఈఎస్ఐ మెడికల్ కాలేజీ, సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, నర్సింగ్ కాలేజీలను ఏర్పాటు చేశామన్నారు. అదేవిధంగా కేవలం పది రూపాయల నామమాత్రపు ఛార్జీతో అన్ని రకాల చికిత్సలు అందించేలా సుమారు 1300 కోట్ల రూపాయల వ్యయంతో ఎయిమ్స్) ఆసుపత్రిని నిర్మిస్తున్నామని, వచ్చే ఏడాది దీనిని ప్రధానమంత్రి ప్రారంభించబోతున్నారని తెలిపారు. హైదరాబాద్ లో అనేక ప్రైవేట్, కార్పోరేట్ ఆసుపత్రులు ఉన్నప్పటికీ, అదే స్థాయిలో ప్రభుత్వ వైద్యశాలల అవసరం కూడా చాలా ఉందని కేంద్ర మంత్రి అన్నారు. ముఖ్యంగా బస్తీలలో నివసించే పేద, మధ్యతరగతి ప్రజలు ఇప్పటికీ చికిత్స కోసం పెద్ద ఎత్తున ప్రభుత్వ ఆసుపత్రులపైనే ఆధారపడుతున్నారని, వారికి అవసరమైన వైద్య సేవలు, పరికరాలు, మందులు అందుబాటులో ఉండాలన్నారు. ఈరోజు హైదరాబాద్ లోని పలు డివిజన్లలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను కిషన్ రెడ్డి సందర్శించారు. ఈ కేంద్రాలలో మెరుగైన వైద్య సేవలు అందించే లక్ష్యంతో పలురకాల వైద్య పరికరాలను అందజేశారు.

....డెస్క్

**శ్రీధర్ బాబు**

రానున్న రోజుల్లో సంగారెడ్డి అంతర్జాతీయ పారిశ్రామిక కారిడార్‌గా రూపొందుతుందని ఐటీ, పరిశ్రమల శాఖా మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. సంగారెడ్డి జిల్లా లోని తోగర్‌పల్లిలో 650 కోట్ల రూపాయలతో నిర్మిస్తున్న కేజీఎస్ ఫుడ్ ప్రాసెసింగ్ ఇండస్ట్రీకి మంత్రి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.... 2047 నాటి దేశం 3 ట్రిలియన్ల ఆర్థిక ప్రగతిలో భాగంగా తెలంగాణాలో కూడా జాతీయ ఉత్పత్తిలో 10 శాతం సాధించే దిశగా పరిశ్రమల ప్రగతికి కృషి

చేస్తున్నామని అన్నారు. ఓఆర్ఆర్ వెంట ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. వ్యవసాయం, వ్యవసాయాధిరిత పరిశ్రమల ఏర్పాటుకు ప్రోత్సాహిస్తున్నట్లు తెలిపారు.

.....SANGAREDDY. PTC

**హైస్పీడ్ రైలు కారిడార్**

హైదరాబాద్ కేంద్రంగా ప్రతిపాదిత హైస్పీడ్ రైలు కారిడార్ ప్రాజెక్టులపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఈరోజు సచివాలయంలో సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో సమీక్షించారు. హైదరాబాద్ నుండి ముంబై, చెన్నై, బెంగళూరు ప్రధాన నగరాలకు అనుసంధానించే హై స్పీడ్ రైల్ ప్రాజెక్టులతో తెలంగాణ రైజింగ్ 2047 ఎకనామిక్ గ్రోత్ కారిడార్ గా అభివృద్ధి చెందే అవకాశం ఉందని సి.ఎస్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. ప్రజల భవిష్యత్ అవసరాలకు, పారిశ్రామిక, ఐటి, పర్యాటక రంగాలలో అభివృద్ధికి ఈ ప్రాజెక్ట్ ఉపకరిస్తుందని తెలిపారు. మరోవైపు.. హైదరాబాద్ – పూనే – ముంబై హై స్పీడ్ రైల్ మార్గానికి డి.పి.ఆర్ సిద్ధం అయ్యిందని రైల్వే అధికారులు తెలిపారు. సూమారు 671 కిలో మీటర్ల మార్గానికి ప్రతిపాదనలు సిద్ధం చేశామని, తెలంగాణ రాష్ట్రంలో 93 కిలో మీటర్ల మేరకు భూ సేకరణ అవసరం ఉంటుందని వివరించారు. అదేవిధంగా హైదరాబాద్ – బెంగళూరు కారిడార్, హైదరాబాద్ – చెన్నై కారిడార్ లో సూమారు 123 కిలో మీటర్ల నిడివిలో భూసేకరణ అవసరమని, అధికారులు పేర్కొన్నారు.

.....పిటిసి, హైదరాబాద్

**రోడ్ షో**

భారత ఫార్మా రంగం గత కొన్నేళ్లుగా గణనీయస్థాయిలో విస్తరిస్తోందని, ఫారిన్ ట్రేడ్ హైదరాబాద్ ప్రాంతీయ జాయింట్ డైరెక్టర్ జనరల్ అక్షయ్ అన్నారు . సెప్టెంబర్ 7 నుంచి 9

వరకు ఢిల్లీలోని భారత్ మండపంలో జరగనున్న 'ఫార్మా మాక్‌టెక్ - ల్యాబ్‌నెక్స్ట్ ఎక్స్ పో 2026' రెండో విడతకు సన్నాహకంగా ఇంజనీరింగ్ ఎక్స్ పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ ఈ రోజు హైదరాబాద్‌లో రోడ్‌షోను నిర్వహించింది. ఫార్మా యంత్రాలు, ల్యాబ్ పరికరాల రంగంలో భారతదేశాన్ని ఆవిష్కరణల కేంద్రంగా తీర్చిదిద్దడంపై ఈ కార్యక్రమంలో చర్చాగోష్ఠులు చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అక్షయ్ మాట్లాడుతూ.. ఉత్పాదకులు ప్రపంచ మార్కెట్ అవసరాలకు అనుగుణంగా మారవలసిన ఆవశ్యకత ఉందన్నారు. అలాగే ప్రత్యేక యంత్రాల దేశీయ ఉత్పత్తిని వేగవంతం చేయాలని ఆయన పరిశ్రమ రంగాన్ని కోరారు. ఈఈపీసీ భారత్ కార్యనిర్వాహక డైరెక్టర్- కార్యదర్శి అధిప్ మిత్ర మాట్లాడుతూ.. అమెరికాకు చేసే ఫార్మా ఎగుమతులను 2030 నాటికి 130 బిలియన్ డాలర్లకు పెంచాలని భారత్ లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. ఈ రోడ్‌షోలో సీడీఎస్‌సీఓ డిప్యూటీ డ్రగ్స్ కంట్రోలర్ కే. నరేంద్రన్, హైదరాబాద్ ఈసీజీసీ సీనియర్ మేనేజర్ సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

......డెస్క్

**HRC**

ఉమ్మడి రాష్ట్రంలో నమోదై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్‌కు సంబంధించిన 9వేల 378 కేసులు ఇంకా తెలంగాణ మానవ హక్కుల కమిషన్ కార్యాలయంలోనే ఉన్నాయని, ఆ ఫైళ్లను APSHRC కి బదిలీ చేస్తూ, కేసుల వివరాలను TGHRC వెబ్‌సైట్‌లో ఉంచినట్లు కార్యాలయ అధికారులు తెలిపారు. సంబంధిత ఫిర్యాదుదారులు, ఇతర సంబంధిత పక్షాలు ఇకపై ఆయా కేసులకు సంబంధించిన సమాచారం, తదుపరి చర్యల కోసం APSHRC కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు.

....డెస్క్

**మహేష్ కుమార్**

ఎస్ఐఆర్‌ను హడావిడిగా చేయాల్సిన అవసరం లేదని, ఆ ప్రక్రియను ఏడాదిన్నరపాటు జాగ్రత్తగా చేయాలని ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. ఎస్ఐఆర్ అంశంపై పీసీసీ బృందం ఈరోజు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డిని

కలిసి వినతిపత్రం సమర్పించింది. అనంతరం మహేష్ కుమార్ గౌడ్ మీడియాతో మాట్లాడుతూ.. జనగణన ప్రక్రియ ఇప్పటికే జరుగుతోందని, జనగణనతో పాటే ఎస్ఐఆర్ నిర్వహిస్తే సిబ్బందిపై ఒత్తిడి పెరుగుతుందన్నారు. ఎస్ఐఆర్‌లో ఓటు తొలగిస్తే దరఖాస్తు చేసుకునే గడువు 3 నెలలకు పెంచాలని కోరారు.

........డెస్క్

**మొక్కజొన్నలు**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్రంలో మొక్కజొన్న కొనుగోళ్లను వేగవంతం చేసినట్లు వ్యవసాయశాఖ వెల్లడించింది. గురువారం వరకు 8లక్షల 16వేల 102 టన్నుల మక్కలు కొన్నామని, 15 రోజుల్లోనే లక్ష్యం పూర్తిచేసేలా పని చేస్తున్నట్లు తెలియజేసింది. ఇటీవల ముఖ్యమంత్రి జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఆదేశాలివ్వగా... దానికి అనుగుణంగా నిరంతరంగా కొనుగోళ్లు చేస్తున్నామని అధికారులు తెలిపారు. ప్రతి కొనుగోలు కేంద్రానికి ఒక నోడల్ అధికారిని నియమించామని, గోనెసంచులు, వాహనాలు, రవాణా, నిల్వ సౌకర్యాలను కల్పించామని వివరించారు.

......డెస్క్

**పారిశ్రామిక శిక్షణ సంస్థ**

సంగారెడ్డి లోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థలో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైనట్లు ప్రిన్సిపాల్ డి.తిరుపతిరెడ్డి తెలిపారు...ప్రభుత్వం యువతకు శిక్షణ ముగియగానే సత్వరమే ఉపాధి కల్పించేలా అడ్వాన్సు టెక్నాలజీ కేంద్రాల్లో పలు కొత్త కోర్సులను అందిస్తోందన్నారు.

**సంగారెడ్డి ఐటిఐ ప్రిన్సిపల్ తిరుపతి రెడ్డి ......వాయిస్**

.......SANGAREDDY PTC

**ఇందిరమ్మ ఇళ్లు**

పేదల సొంతింటి కలను నిజం చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు.. రాజన్న సిరిసిల్ల జిల్లా లోని పలు గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని లబ్ధిదారులకు ప్రభుత్వం పక్షాన నూతన వస్త్రాలను అందజేశారు. ఈ సందర్భంగా రుద్రంగిలో లబ్ధిదారు మంచె సునీత మాట్లాడుతూ ... సొంతింటి కల నెరవేరడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

**ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారు మంచె సునీత........, సౌండ్ బైట్**

......పిటిసి, రాజన్న సిరిసిల్ల జిల్లా

**రాజాసింగ్**

మధ్యప్రదేశ్‌లోని భోజ్‌శాల ఆలయ కేసులో హిందువులకు పెద్ద విజయం లభించిందని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ హర్షం వ్యక్తం చేశారు. ఈ చారిత్రక ఆలయం విముక్తి కోసం హిందూ సమాజం గత 124 ఏళ్లుగా సుదీర్ఘ పోరాటం చేస్తోందని ఆయన గుర్తు చేశారు. కోర్టు వెలువరించిన తాజా నిర్ణయం సనాతన ధర్మానికి, సత్యానికి, న్యాయానికి దక్కిన గొప్ప విజయమని రాజాసింగ్ పేర్కొన్నారు. ఈ తీర్పుతో సనాతన ధర్మం మళ్లీ గెలిచిందని, సుదీర్ఘకాలంగా హిందువులు ఎదురుచూస్తున్న కల నెరవేరిందని ఆయన అభిప్రాయపడ్డారు.

......HYD –PTC

**సమాచార హక్కు చట్టం**

ప్రభుత్వ యంత్రాంగంపై ప్రజలకు విశ్వాసాన్ని కల్పిస్తూ.. పారదర్శకత, జవాబుదారీతనాన్ని పెంపొందించడమే సమాచార హక్కు చట్టం ముఖ్య ఉద్దేశ్యమని రాష్ట్ర సమాచార కమిషన్ చీఫ్ కమిషనర్ డాక్టర్ జి.చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. పీఐఓలు, ఏపీఐఓలు, అన్ని శాఖల

అధికారులకు నిజామాబాద్ కలెక్టరేట్‌లో నిర్వహించిన అవగాహన సదస్సుకు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చీఫ్ కమిషనర్ మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య దేశంలో సమాచారం అందుబాటులో ఉంటేనే ప్రజలకు ఉపయోగమని, ప్రజలు కోరిన సమాచారాన్ని వారికి తెలియజేసే బాధ్యత అధికారులపై ఉందని అన్నారు.

......PTC - నిజామాబాద్

**ధాన్యం కొనుగోళ్లు – యాదాద్రి భువనగిరి**

యాదాద్రి భువనగిరి జిల్లాలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోలు, లోడింగ్ ప్రక్రియలో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అధికారులను ఆదేశించారు. ఈ రోజు జాలూరు గ్రామంలోని ధాన్యం కొనుగోలు ఆయన పరిశీలించారు. ప్రతిరోజు కనీసం 8 నుంచి 10 లారీలు ధాన్యం లోడ్ అయ్యేలా చూడాలని సూచించారు.

.......పీ టీ సీ యాదాద్రి భువనగిరి

**చెంచుల జీవనోపాధి**

నాగర్‌కర్నూల్ జిల్లాలోని ఆదివాసి గిరిజన అత్యంత పేద, వెనుకబడిన వర్గాల జీవన ప్రమాణాలను మెరుగుపరచేందుకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న తెలంగాణ ఇన్‌క్లూజివ్ లైవ్లీహుడ్స్ ప్రోగ్రాంను సమర్థవంతంగా అమలు చేసి చెంచు గిరిజన కుటుంబాలను ఆర్థికంగా స్వావలంబన దిశగా తీసుకెళ్లాలని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ అధికారులను ఆదేశించారు. అచ్చంపేట నియోజకవర్గ పరిధిలోని మల్లాపూర్ పెంట గ్రామాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించి, అత్యంత పేదరిక పరిస్థితుల్లో జీవిస్తున్నట్లు గుర్తించిన 34 చెంచు కుటుంబాలతో సమావేశమై వారి సమస్యలను నేరుగా తెలుసుకున్నారు.

.....PTC నాగర్‌కర్నూల్ జిల్లా